# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 28-03-2026** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. దేశ తీరప్రాంతాలు, సరిహద్దుల వద్ద భద్రతను కట్టుదిట్టం చేయాలని రాష్ట్ర ప్రభుత్వాల అధికారులను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదేశించారు.

2. పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకం తగ్గింపును ఆంధ్రప్రదేశ్ స్వాగతిస్తోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

3. మానవజాతి గొప్ప ఆవిష్కరణల్లో ఒకటైన కృత్రిమ మేధ రెండు వైపులా పదునైన కత్తిలాంటిదని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి తెలిపారు.

4. ఆంధ్రపదేశ్ శాసన సభ ఈ రోజు ఉదయం 11 గంటలకు ప్రత్యేకంగా సమావేశం కానుంది.

5. విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించటం కానీ, స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియాలో విలీనం చేసే పరిస్థితులు ఉత్పన్నం కావని కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ స్పష్టం చేశారు.

==========================

పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులపై అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిన్న దృశ్య మాధ్యమ సమావేశం నిర్వహించారు. ప్రస్తుత సంక్షోభ పరిస్థితుల్లో భద్రతకు విఘాతం కలిగించే విద్రోహ శక్తులపై అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. దేశ తీరప్రాంతాలు, సరిహద్దుల వద్ద భద్రతను కట్టుదిట్టం చేయాలని రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రధాని ఆదేశించారు. తప్పుడు సమాచారం, వదంతుల వ్యాప్తి పట్ల జాగ్రత్తగా ఉండాలని, అలాంటి చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. పశ్చిమాసియాలో పరిస్థితులు ఇంకా ఆందోళనకరంగానే ఉన్నాయని, టీం ఇండియాగా కలిసికట్టుగా పనిచేస్తే సవాళ్లను అధిగమించవచ్చని ప్రధానమంత్రి అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, తెలంగాణ ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి పాల్గొన్నారు.

--------------------------

పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకం తగ్గింపును ఆంధ్రప్రదేశ్ స్వాగతిస్తోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ఈ మేరకు ఆయన సామాజిక మధ్యమం ఎక్స్ లో పోస్టు చేశారు. అనేక దేశాలు ఇంధన ధరల భారం ప్రజలపై మోపుతున్నాయని, భారత్ మాత్రం ప్రజా ప్రయోజనాలు దృష్టిలో పెట్టుకొని చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. క్లిష్టపరిస్థితుల్లో దేశానికి స్థిరత్వం కల్పిస్తున్న మోదీ నేతృత్వం దేశానికి ఓ వరమని చెప్పారు. పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకాలు తగ్గించడం దేశ ప్రజలకు ఊరటనిచ్చే నిర్ణయమని ఉప ముఖ్యమంత్రి

కే. పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. పశ్చిమాసియా యుద్ధ ప్రభావం మనపై పడకుండా సుంకాల తగ్గింపుతో ఊరట కల్పించారని చెప్పారు. ఇంధన కొరత రాకుండా ప్రత్యామ్నాయ మార్గాలు అనుసరిస్తున్నారని తెలిపారు.

---------------------------

మానవజాతి గొప్ప ఆవిష్కరణల్లో ఒకటైన కృత్రిమ మేధ రెండు వైపులా పదునైన కత్తిలాంటిదని, దీనితో అప్రమత్తంగా ఉండి సరైన జాగ్రత్తలు తీసుకోకపోతే ప్రతికూల ప్రభావాలు ఎక్కువగా ఉంటాయని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి అన్నారు. అమెరికాలోని హార్వర్డ్ విశ్వవిద్యాలయం కృత్రిమ మేధస్సుపై నిన్న నిర్వహించిన సదస్సులో ఆయన దృశ్య మాధ్యమం ద్వారా పాల్గొని మాట్లాడారు. కృత్రిమ మేధ వినియోగం కారణంగా ఎదురవుతున్నసవాళ్లను అధిగమించడంలో తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ముఖ్యమంత్రి ఈ సందర్భంగా వివరించారు. కృత్రిమ మేధ ద్వారా గ్లోబల్ టూరిజం, గ్రీన్ ఎనర్జీ, ఎలక్ట్రిక్ వాహనాలు, మౌలిక సదుపాయాలు వంటి రంగాల్లో ఉద్యోగాలను యుద్ధప్రాతిపదికన పెంచుతున్నామని ఆయన చెప్పారు.

---------------------------

వచ్చే మూడు సంవత్సరాలలో నెల్లూరు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఉన్నత పాఠశాలలన్నింటినీ ఆధునీకరించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. నెల్లూరు నగరం పొదలకూరు రోడ్డులోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలను ఆయన నిన్న పరిశీలించారు. అనంతరం మంత్రి నారాయణ పాత్రికేయులతో మాట్లాడుతూ...

వాయిస్.. 30 సెకన్లు

---------------------------

ఆరోగ్య సంరక్షణలో భాగంగా విద్యార్థుల కోసం ప్రత్యేక డిజిటల్ హెల్త్ పోర్టల్ ను రూపొందించినట్లు ఆంధ్రప్రదేశ్ వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి వై. సత్యకుమార్ యాదవ్ తెలిపారు. దేశంలోనే తొలిసారిగా 13 నుంచి 19 సంవత్సరాల మధ్య ఉన్న విద్యార్థుల కోసం "ఆంధ్రప్రదేశ్ స్కూల్ హెల్త్ అండ్ వెల్నెస్" ప్రోగ్రాం కింద "ఏపీఎస్ హెచ్ డబ్ల్యూపీ" పేరుతో డిజిటల్ పోర్టల్ ను రూపొందించినట్లు చెప్పారు. బాలబాలికలు ముఖ్యంగా వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్య సంరక్షణ, మత్తు పదార్థాల వినియోగానికి దూరంగా ఉండడం, లింగ సమానత్వం, హెచ్ఐవీ, రోడ్డు ప్రమాదాల బారినపడకుండా ఉండడం, ఇంటర్నెట్, సామాజిక మాధ్యమాల సురక్షిత వినియోగం వంటి అంశాలపై స్వీయ విధానంలో నేర్చుకునేలా "ఏపీఎస్‌హెచ్‌డబ్ల్యూపీ" పోర్టల్ ను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు వివరించారు.

---------------------------

మార్కాపురం జిల్లా రాయవరంలో జరిగిన బస్సు ప్రమాదంలో గుర్తుపట్టలేని 14 మృతదేహాలను వారి తోబుట్టువుల డీఎన్ఏలతో గుర్తించినట్లు ఆంధ్రప్రదేశ్ వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి వై. సత్యకుమార్ యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. గుర్తించిన మృతదేహాలను ఈ ఉదయం నుంచి వారి కుటుంబ సభ్యులకు అప్పగిస్తామని చెప్పారు. ప్రభుత్వం ఏర్పాటు చేసే అంబులెన్సుల ద్వారా వారి స్వస్థలాలకు మృతదేహాలను ఎస్కార్ట్ సాయంతో పంపించనున్నట్లు చెప్పారు. ఒంగోలు, మార్కాపురం ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని వైద్య అధికారులు తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ శాసన సభ ఈరోజు ఉదయం 11 గంటలకు ప్రత్యేకంగా సమావేశం కానుంది. ఈ సమావేశంలో రాష్ట్ర రాజధానిగా అమరావతిని గుర్తిస్తూ ప్రత్యేక తీర్మానం చేయనున్నారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం 2014, సెక్షన్ 5లో ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతి అనే పదాన్ని చేర్చాలని కోరనున్నారు. అమరావతికి చట్ట బద్దత కల్పిస్తూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సభలో తీర్మానాన్ని ప్రవేశ పెట్టనున్నారు.

---------------------------

విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించటం, స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియాలో విలీనం చేసే పరిస్థితులు ఉత్పన్నం కావని కేంద్ర ఉక్కుశాఖ సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ స్పష్టం చేశారు. నిన్న రాజ్యసభలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సభ్యుడు వైవీసుబ్బారెడ్డి అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానం ఇచ్చారు. దేశంలో ప్రభుత్వరంగంలో పనిచేస్తున్న అన్ని స్టీల్‌ప్లాంట్ల మాదిరిగానే కొన్ని కార్యకలాపాల కోసం కొన్ని ఏజెన్సీల సాయం తీసుకుంటున్నట్లు చెప్పారు. “రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ ఆస్తులన్నింటినీ ఆ సంస్థ శాశ్వత ఉద్యోగులే నిర్వహిస్తున్నారని ఆయన తెలిపారు. కేంద్ర ప్రభుత్వ రంగంలోని ఇతర స్టీల్‌ప్లాంట్ల తరహాలోనే ఈ చర్యలు తీసుకుంటున్నామని కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ పేర్కొన్నారు.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్” మనసులోని మాట కార్యక్రమం 132 వ సంచిక రేపు ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ తెలుగు అనువాదం ప్రధాని ప్రసంగం అయిన వెంటనే ఒకసారి, రాత్రి 8 గంటలకు మరోసారి ఉభయ తెలుగు రాష్ట్రాలలోని అన్ని ఆకాశవాణి కేంద్రాల ద్వారా ప్రసారమౌతుంది.

---------------------------

ఆంధ్రప్రదేశ్, యానాంలపై దిగువ ట్రోపో ఆవరణంలో ఆగ్నేయ, నైరుతి దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. వీటి ఫలితంగా రాష్ట్రంలోని ఉత్తర కోస్తాంధ్రప్రదేశ్, యానాంలలో ఈరోజు తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు, ఉరుములతో కూడిన జల్లులు ఒకటి రెండు చోట్ల కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం అధికారి ఎల్. నారాయణ పేర్కొంటూ..

వాయిస్..20 సెకన్లు

మరోవైపు తెలంగాణలో రానున్న మూడు రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ లో భారత వాతావరణ కేంద్రం తెలిపింది.

=====================